మీ విత్తనం మంచిదేనా..?

- మీ దిగుబడి మీ చేతుల్లోనే..
- వానకాలం వరిలో మేలైన వంగడంతో అధిక దిగుబడి
- విత్తన ఎంపిక చాలా ముఖ్యం
- ఏది బెటరో..? తేల్చుకోలేకపోతున్నారా..?
- మీ కోసం వ్యవసాయ శాఖ, శాస్త్రవేత్తల సలహాలు

కరువులో పంట తీసినం. నానాపాట్లు పడి యాసంగిని ఎల్లదీసినం. మరి ఈ వానకాలం ఏం చేద్దాం..? ఎలా ముందుకు'సాగు'దాం..? అని ఆలోచిస్తున్నారా.. వరిలో ఏ రకం వేద్దాం..? ఏ విత్తనం మంచిది..? ఎప్పుడు నారుపోయాలి..? ఎలాంటి జాగ్రత్తలు పాటించాలి..? అని చింతిస్తున్నారా..? ఏ మాత్రం వద్దు.. మీ కోసం కూనారం వ్యవసాయ పరిశోధనా కేంద్రం శాస్త్రవేత్తలు, వ్యవసాయ శాఖ అధికారులు సలహాలు, సూచనలు ఇస్తున్నారు. అవేంటో ఇక్కడ చూద్దాం..

- కాల్వశ్రీరాంపూర్, జూన్ 21

'వానకాలం సీజన్ మొదలైంది. రైతులు దుక్కి దున్ని, విత్తనాలు విత్తే పనుల్లో నిమగ్నమయ్యారు. వరినాట్లు వేసేందుకు నారుమడులు సిద్ధం చేసుకుంటున్నారు. కొన్నిచోట్ల తూకం పోసి నాటేసేందుకు పొలాలను సిద్ధం చేస్తున్నారు. ఈ సీజన్‌లో వరి సాగు చేస్తున్న రైతులు తమ సలహాలు, సూచనలు తప్పనిసరిగా పాటించాలని వ్యవసాయాధికారులు, కూనారం వ్యవసాయ పరిశోధనా కేంద్రం శాస్త్రవేత్త సిద్ది శ్రీధర్ సూచిస్తున్నారు. వరిలో సరైన సస్యరక్షణ చర్యలు పాటిస్తే లాభాల పంటేనని చెబుతున్నారు.



కేఎన్ఎం 1638 వరి పంట

విత్తనాల ఎంపిక కీలకం

రాష్ట్రంలో సాగయ్యే పంటల్లో వరి ప్రధానమైనది. గతేడాది వానకాలంలో 65 లక్షల ఎకరాలకు పైగా వరి సాగైంది. వాతావరణ శాఖ ముందస్తు అంచనాల ప్రకారం ఈ ఏడాది వర్షాలు సాధారణంగా ఉండే అవకాశమున్నది. ఈ క్రమంలో రైతులు అనువైన వరి రకాలను ఎంపిక చేసుకోవాలి. నీటి వసతిని బట్టి దీర్ఘకాలిక, మధ్యకాలిక, స్వల్పకాలిక రకాలను ఎంపిక చేసుకోవాలి. సమగ్ర యాజమాన్య పద్ధతులు, సస్యరక్షణ చర్యలు సకాలంలో పాటిస్తే తక్కువ పెట్టుబడి ఖర్చుతో ఎక్కువ దిగుబడులు పొందవచ్చు.

దీర్ఘకాలిక రకాలు

ఇందులో సిద్ధి, బీపీటీ 5204 అనుకూలం. ఈ రకాలను చెరువులు, కుంటలు, బావుల కింద మే నెల చివరి వారం నుంచి జూన్ 15 మధ్య నారు పోసుకొని సాగు చేసుకోవచ్చు. బీపీటీ 5204కు చీడపీడలు, తెగుళ్ల ఉధృతి ఎక్కువగా ఉంటుంది. ఎప్పటికప్పుడు పంటను గమనించుకుంటూ తగిన సస్యరక్షణ చర్యలు చేపట్టాలి. అలాగే, సిద్ధి (డబ్ల్యు.జి.ఎల్44) అనే రకం మధ్యస్థ సన్నగింజ దీర్ఘకాలిక రకం. పంట కాలం 145-150 రోజులు. ఎకరానికి 26-30 క్వింటాళ్ల దిగుబడినిస్తుంది.

మధ్యకాలిక రకాలు

ఇవి 130-135 రోజుల పంటకాలం కలిగి ఉంటాయి. ఈ రకాన్ని జూలై మొదటి వారం వరకు నారు పోసుకోవచ్చు. ఇటీవల జగిత్యాల ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం నుంచి విడుదలైన మధ్యకాలిక సన్నగింజ రకాలు జేజీఎల్-28545, జేజీఎల్ 27356 అనుకూలం. ఇందులో జేజీఎల్ 28545 (జగిత్యాల వరి-2) సన్నగింజ మధ్యకాలిక రకం. ఇది ఎకరానికి 28-30 క్వింటాళ్ల దిగుబడినిస్తుంది. అన్నం నాణ్యతను కలిగి ఉంటుంది. ఈ రకం కొంత మేరకు మెడవిరుపు, బ్యాక్టీరియా, ఎండాకు, పొట్టకుళ్లు తెగులును తట్టుకుంటుంది. ఇక జేజీఎల్-27356(జగిత్యాల వరి-3) మిక్కిలి సన్నగింజ రకం. ఇది ఎకరానికి 28-30 క్వింటాళ్ల దిగుబడినిస్తుంది. అధిక బియ్యం శాతాన్ని ఇస్తూ, అన్నం నాణ్యతను కలిగి ఉంటుంది. వీటితోపాటు కృష్ణ, వరంగల్ సన్నాలు వంటి మధ్యకాలిక రకాలను కూడా సాగుచేసుకోవచ్చు. అలాగే, మధ్యకాలిక దొడ్డుగింజ రకమైన రాజేంద్రనగర్ వరి 28361 పొడవు, సన్నగింజను కలిగి ఉండి, ఎకరానికి సుమారు 32-35 క్వింటాళ్ల దిగుబడినిస్తుంది. ఇది సుడిదోమ, చౌడును తట్టుకుంటుంది.

స్వల్పకాలిక రకాలు

వీటి పంటకాలం 120-125 రోజులు. జూన్ 20 నుంచి జూలై చివరి వారం వరకు నారు పోసుకోవచ్చు. ఇందులో కేన్ఎం-1638 (కూనారం వరి-2) మధ్యస్థ సన్నగింజను కలిగి ఉండి ఎకరానికి 28-32 క్వింటాళ్ల దిగుబడినిస్తుంది. ఇది ఉల్లికోడు, అగ్గితెగులు, మెడవిరుపును తట్టుకుంటూ తక్కువ నూకశాతంతో అన్నం నాణ్యత చాలా బాగుంటుంది. పంట చేనుమీద పడిపోకుండా నత్రజని ఎరువులను 20-25 శాతం తగ్గించి, దగ్గర దగ్గరగా మొక్కలను నాటుకుంటే అధిక దిగుబడులు సాధించవచ్చు.

- ఆర్ఎన్ఆర్ 15048 (తెలంగాణ సోన). ఇది వానకాలంలో ఆలస్యంగా విత్తుకోవడానికి అనువైన రకం. పంట కాల పరిమితి 125-130 రోజులు. ఎకరాకు 25-28 క్వింటాళ్ల దిగుబడిని ఇస్తుంది. అగ్గితెగులను సమర్థవంతంగా తట్టుకుంటుంది. అతి సన్నగింజ నాణ్యతతో తక్కువ నూకశాతం కలిగి అన్నం మంచి రుచిని కలిగి ఉంటుంది. ఈ రకాన్ని జూలైలో మాత్రమే పోసుకొని నత్రజని ఎరువును సుమారు 25 శాతం తగ్గించి వేసుకోవాలి. మొగిపురుగు నివారణకు తగిన సస్యరక్షణ చర్యలు పాటించాలి.
- డబ్ల్యు.జీఎల్ 962(వరంగల్ వరి-2): ఇది పొట్టిగా ఉండి అధిక పిలకలు వేస్తూ ఎకరానికి 28-30 క్వింటాళ్ల దిగుబడినిస్తుంది. గింజ మరియు అన్నం నాణ్యత సాంబమసూరి వలె ఉంటుంది. అలాగే ఎక్కువ విస్తీర్ణంలో దొడ్డుగింజ స్వల్పకాలిక రకాలైన కేఎన్ఎం-118, జేజీఎల్ 24423, ఆర్ఎన్ఆర్ 29325 వంటి రకాలను కూడా సాగు చేసుకోవచ్చు.

విత్తన శుద్ధి చాలా కీలకం..

వరి పండించే రైతులు ముఖ్యంగా తెలుసుకోవాల్సింది సరైన మోతాదులో విత్తన ఎంపిక, శుద్ధి చేయడం. ఒక ఎకరానికి నాటే విత్తనాల్లో దొడ్డు రకం అయితే 25 కేజీలు, సన్న రకమైతే 20 కేజీలను ఎంపిక చేసుకోవాల్సి ఉంటుంది. అలాగే, హైబ్రిడ్ రకం అయితే 10 కిలోలు సరిపోతాయి. విత్తన శుద్ధి చాలా ముఖ్యం. దమ్ము చేసిన నారుమళ్లయితే లీటరు నీటికి ఒక గ్రాము కార్బండాజిమ్ కలిపిన ద్రావణంలో 24 గంటలు నానబెట్టి తర్వాత మండెకట్టిన మొలకలను నారుమడిలో చల్లుకోవాల్సి ఉంటుంది. కిలో విత్తనాలకు లీటరు ద్రావణం సరిపోతుంది. అయితే నిద్రావస్థను తొలగించడానికి లీటరు నీటికి తక్కువ, నిద్రావస్థ ఉన్న విత్తనాలైతే 6.3 మిల్లీలీటర్లు, ఎక్కువ నిద్రావస్థ కలిగి ఉన్న విత్తనాలకైతే 10 మిల్లీలీటర్ల గాఢ నత్రికామ్లం ఆ ద్రావణంలో 24 గంటలు నానబెట్టి కడిగి మండెకట్టాలి.

నారుమడిలో యాజమాన్య పద్ధతులు

నారుమడిని 10-12 రోజుల వ్యవధిలో మూడుదఫాలుగా దమ్ము చేసి చదును చేసుకోవాలి. 2 గుంటల నారుమడిలో 2కిలోల నత్రజని (ఒక కిలో విత్తనం చల్లే ముందు, మరో కిలో విత్తిన 12-14 రోజులకు), రెండు కిలోల భాస్వరం, కిలో పొటాష్‌నిచ్చే ఎరువులు వేసుకోవాలి. వీలైతే పశువుల ఎరువును లేదా ఇతర సేంద్రియ ఎరువులను దమ్ములో వేసుకుంటే మంచిది. జింక్ లోప నివారణకు లీటరు నీటికి 2గ్రాముల జింక్ సల్ఫేట్ కలిపిన ద్రావణాన్ని పిచికారి చేసుకోవాలి. ఉత్తర తెలంగాణ మండల జిల్లాలలో ఉల్లికోడు ఉధృతి ఎక్కువ ఉండే అవకాశం ఉన్నందున నారుపీకే వారం రోజుల ముందు ఒక ఎకరానికి సరిపడా నారుమడికి 800 గ్రాముల కార్బోఫ్యూరాన్ 3జి గుళికలు ఇసుకలో కలిపి బురద పదనులో చల్లుకోవాలి.

ఆర్టీసీ సిబ్బంది హ్యాట్సాప్

ఆర్టీసీ సిబ్బంది తమ పనితీరుతో శభాష్ అనిపించుకున్నారు. బస్సులో ₹3 లక్షల నగదుతోపాటు ₹7 లక్షల విలువైన బంగారు ఆభరణాలు మరిచిపోయిన ఇద్దరు ప్రయాణికులకు తిరిగి నగదు, బంగారం అప్పగించారు.

బంగారు ఆభరణాలతో డిపో అధికారులు

బస్సులో మరిచిపోయిన రూ.3లక్షల క్యాష్‌బ్యాగ్‌ను ప్రయాణికుడికి అందజేస్తున్న కరీంనగర్ ఆర్ఎం సుచరిత

₹7 లక్షల బంగారు ఆభరణాలు దొరికినయ్

ఫర్టిలైజర్‌సిటీ, జూన్ 21: గోదావరిఖని ఆర్టీసీ బస్సులో పోగొట్టుకున్న సుమారు ₹7 లక్షల విలువైన బంగారు ఆభరణాలను తిరిగి ప్రయాణికురాలికి అప్పగించారు. వివరాల్లోకి వెళ్తే.. ఈ నెల 19న గోదావరిఖని డిపోకు చెందిన ఎక్స్‌ప్రెస్ బస్సు సికింద్రాబాద్ నుంచి గోదావరిఖనికి వస్తుండగా సుల్తానాబాద్ వద్ద కండక్టర్ కే శ్రీనివాస్ బస్సులో ఎవరో మర్చిపోయిన చేతి సంచిన గమనించాడు. అందులో బంగారు ఆభరణాలను గుర్తించి గోదావరిఖని డిపో అధికారులకు అప్పగించాడు. అయితే, ఓదెల మండలం కొలనూరుకు చెందిన తోట లక్ష్మి బస్సులో 90 గ్రాముల బంగారు ఆభరణాలతో ఉన్న హ్యాండ్ బ్యాగ్‌ను మర్చిపోగా.. బంధువులు తగిన ఆధారాలతో గోదావరిఖని ఆర్టీసీ అధికారులను సంప్రదించారు. దీంతో శుక్రవారం ఆర్టీసీ డిపో మేనేజర్ ఎం నాగభూషణం దాదాపు బంగారు అభరణాల బ్యాగును ఆమె బంధువులకు అందజేశారు. ఈ సందర్భంగా కండక్టర్ శ్రీనివాస్‌ను డిపో అధికారులు అభినందించారు. ఇక్కడ డిపో అసిస్టెంట్ మేనేజర్ ట్రాఫిక్ కే గీతా కృష్ణ, డిప్యూటీ సూపరింటెండెంట్ కే సదానందం, సెక్యూరిటీ సిబ్బంది సత్యనారాయణ, అఖిల ఉన్నారు.

మరిచిపోయిన ₹3 లక్షల బ్యాగ్ దొరికింది

తెలంగాణచౌక్, జూన్21 : ఆర్టీసీ సిబ్బంది చాకచక్యంగా వ్యవహరించి ప్రయాణికుడు బస్సులో మరిచిపోయిన క్యాష్ బ్యాగును తిరిగి అప్పగించారు. మంచిర్యాల జిల్లాకేంద్రానికి చెందిన పవన్ రంగారెడ్డి జిల్లా ఘట్‌కేసర్‌లో స్థిరపడ్డాడు. తన స్వస్థలం మంచిర్యాలలో ఉన్న భూమిని అమ్మగా వచ్చిన డబ్బులు తీసుకునేందుకు గురువారం ఉదయం వచ్చాడు. తిరిగి ₹3లక్షలను బ్యాగులో తీసుకొని మధ్యాహ్నం హైదరాబాద్ వెళ్తూ మంచిర్యాల డిపో బస్సు ఎక్కాడు. ఆ బ్యాగును సీట్లోనో ఉంచి పెద్దపల్లి బస్టాండ్‌లో మూత్రవిసర్జన కోసం దిగాడు. తిరిగివచ్చేసరికి బస్సు వెళ్లిపోవడంతో ఆందోళన చెందాడు. వెంటనే ఈ విషయాన్ని బస్టాండ్‌లోని సిబ్బంది ద్వారా కరీంనగర్ సెక్యూరిటీ సిబ్బందికి తెలిపాడు. సెక్యూరిటీ గార్డు రమేశ్ గమ్యం యాప్ ద్వారా బస్సును గుర్తించి కరీంనగర్‌కు చేరుకోగానే బస్సులోని క్యాష్ బ్యాగును డ్రైవర్, కండక్టర్ సమక్షంలో స్వాధీనం చేసుకున్నాడు. శుక్రవారం పవన్ తండ్రి బలరాం కరీంనగర్ ఆర్ఎం కార్యాలయానికి వచ్చి ఆర్టీసీ ఏటీఎం రజనీకృష్ణ, సెక్యూరిటీ ఇన్‌స్పెక్టర్ సురేంద్రనాథ్ నగదుకు సంబంధించిన ఆధారాలు చూపాడు. దీంతో ఆర్ఎం సుచరిత క్యాష్‌బ్యాగును అప్పగించారు. ఈ సందర్భంగా సెక్యూరిటీ గార్డు రమేశ్‌ను ఆర్ఎం ప్రత్యేకంగా అభినందించారు.

వేలంలో ప్రభుత్వం, సింగరేణి పాల్గొనద్దు

- **ఐక్య కార్మిక సంఘాల డిమాండ్**

గోదావరిఖని, జూన్ 21 : సింగరేణి కోల్ బ్లాక్‌ల వేలంలో రాష్ట్ర ప్రభుత్వం, సింగరేణి కంపెనీ పాల్గొనకూడదని సింగరేణి కార్మిక సంఘాల ఐక్యవేదిక డిమాండ్ చేసింది. ఈ మేరకు హెచ్ఎంఎస్ ప్రధాన కార్యాలయంలో జరిగిన ఐక్యవేదిక సమావేశంలో పలు కార్మిక సంఘాల నాయకులు మాట్లాడారు. వేలం ద్వారా బొగ్గు బ్లాక్‌ను కైవసం చేసుకున్న ప్రాంతంలో ప్రజలందరినీ కదిలించి బొగ్గుపెల్లను కార్పొరేట్ శక్తులకు చేరవేయకుండా సింగరేణి సంస్థను, భవిష్యత్‌ను కాపాడుకోవాలన్నారు. గుజరాత్‌లో జరిగిన వేలం మాదిరిగానే తెలంగాణలో కూడా గనుల వేలంను పాటించాలన్నారు. ఈ సందర్భంగా వారు సమావేశంలో గనుల వేలానికి నిరసనగా పలు తీర్మానాలు చేసుకున్నారు. ఈ నెల 24 నుంచి జూలై 3 వరకు బొగ్గు గనుల వద్ద గేట్ మీటింగ్‌లు, కొత్తగూడెం, భూపాలపల్లి, శ్రీరాంపూర్, గోదావరిఖనిలోని ప్రెస్‌క్లబ్‌లో ప్రెస్‌మీట్‌లు, జూలై 3న హైదరాబాద్ ప్రెస్‌క్లబ్‌లో పెద్ద ఎత్తున మేధావులు, ట్రేడ్ యూనియన్‌లతో రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించేందుకు తీర్మానం చేసినట్లు చెప్పారు. సమావేశం అనంతరం నిర్ణీత తేదీ ఖరారుతో రాష్ట్ర ముఖ్యమంత్రిని కలిసి విజ్ఞప్తి చేయాలని నిర్ణయించారు. ఐక్య వేదిక కన్వీనర్ రియాజ్ అహ్మద్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో హెచ్ఎంఎస్, ఐఎఫ్‌టీయూ, టీఎన్‌టీయూసీ, జీఎల్‌బీకేఎస్ నాయకులు జే నారాయణ, ఐ కృష్ణ, ఈ నరేశ్, కుమార స్వామి, కామెర గట్టయ్య, జీ రాములు, రాయమల్లు, రామకృష్ణ, రాజేందర్, ఏడుకొండలు, దామోదర్‌రెడ్డి, కోటగిరి పాపయ్య, తదితరులు పాల్గొన్నారు.

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న రియాజ్ అహ్మద్

వాణిజ్య

టెక్టోరోకు గూగుల్ గ్రోత్ అవార్డు

హైదరాబాద్, జూన్ 21 (నమస్తే తెలంగాణ): ఆండ్రాయిడ్ ఎంటర్‌ప్రైజ్ సొల్యూషన్‌లో విశేషమైన సహకారం అందించినందుకుగాను గూగుల్ నుంచి ప్రతిష్ఠాత్మక యాక్సిలరేటర్ అవార్డును అందుకున్నది టెక్టోరో కన్సల్టింగ్ సంస్థ. లండన్‌లో జరిగిన ఆండ్రాయిడ్ ఎంటర్‌ప్రైజ్ గ్లోబల్ పార్ట్‌నర్ సమ్మిట్‌లో ఈ అవార్డును టెక్టోరో ఎండీ శ్రీధర్ దన్నపనేని అందుకున్నారు. ఈ సందర్భంగా శ్రీధర్ దన్నపనేని మాట్లాడుతూ.. గ్రోత్ యాక్సిలరేటర్ అవార్డును అందుకోవడం గర్వంగా ఉందన్నారు. ఈ గుర్తింపు అంకితభావంతో కూడిన మా బృందానికి, వారి కృషి, పట్టుదలకు నిదర్శనమన్నారు.

జేకే టైర్ 120 కోట్ల పెట్టుబడి

హైదరాబాద్, జూన్ 21: ప్రముఖ టైర్ల సంస్థ జేకే టైర్..కమర్షియల్ వాహనాలను దృష్టిలో పెట్టుకొని మార్కెట్లోకి మరో నాలుగు టైర్లను విడుదల చేసింది. ఈ సందర్భంగా కంపెనీ ప్రెసిడెంట్ అనుజ్ కథూరియా మాట్లాడుతూ.. అడ్వాన్స్ టెక్నాలజీతో రూపొందించిన ఈ టైర్లతో కమర్షియల్ వాహనాల నిర్వహణ ఖర్చులు తగ్గుముఖం పట్టనున్నాయని, ఈ నూతన శ్రేణి టైర్లను రూపొందించడానికి మైసూరులో రూ.600 కోట్ల పెట్టుబడితో ప్రత్యేకంగా పరిశోధన-అభివృద్ధి కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు చెప్పారు. అలాగే ఆర్‌అండ్‌డీ కోసం ప్రతియేటా రూ. 120 కోట్ల మేర పెట్టుబడులు పెడుతున్నట్లు తెలిపారు.

ఫార్మా కోసం ప్రత్యేక క్లస్టర్!

హైదరాబాద్, జూన్ 21: ఫార్మా సర్వీసుల కోసం ప్రత్యేక క్లస్టర్‌ను ఏర్పాటు చేయాలని రాష్ట్ర ప్రభుత్వానికి ఫార్మా రంగ ప్రతినిధులు సూచించారు. భారత పరిశ్రమల సమాఖ్య(సీఐఐ) ఏర్పాటు చేసిన రౌండ్ టేబుల్ సమావేశంలో ఫార్మా రంగ సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఐఐ తెలంగాణ ఫార్మా అండ్ లైఫ్ సెన్సెస్ ప్యానెల్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ కన్వీనర్ శిల్పా రెడ్డి మాట్లాడుతూ..తెలంగాణ రాష్ట్రంలో 800కి పైగా లైఫ్ సెన్సెస్ కంపెనీల విలువ 50 బిలియన్ డాలర్లకు పైగా ఉన్నదని, అలాగే దేశీయ ఫార్మా ఉత్పత్తుల్లో ఇక్కడి నుంచే 40 శాతం ఉత్పత్తి అవుతున్నాయన్నారు. ఇందుకోసం కొత్తగా ప్రత్యేక క్లస్టర్‌ను ఏర్పాటు చేయాలని సూచించారు.

ఆర్థిక అసమానతలు తగ్గవు!

రాయిటర్స్ పోల్‌లో 84 శాతం ఆర్థికవేత్తల అభిప్రాయమిదే

(స్పెషల్ టాస్క్ బ్యూరో)

హైదరాబాద్, జూన్ 21 (నమస్తే తెలంగాణ): రానున్న ఐదేండ్లలో భారత్‌ను మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా నిలబెట్టడమే తన లక్ష్యమని లోక్‌సభ ఎన్నికలకు ముందు ప్రధాని నరేంద్ర మోదీ ఊదరగొట్టారు. భారత్ మెరుగైన వృద్ధిరేటుతో దూసుకుపోతున్నదని కేంద్రప్రభుత్వ ఏజెన్సీలూ గతకొంతకాలంగా ప్రచారం చేస్తున్నాయి. గడిచిన ఆర్థిక సంవత్సరంలో ఆర్థిక వృద్ధి 8 శాతం వరకు ఉన్నట్టు కేంద్రం ప్రకటించింది. అయితే, ఎవరెన్ని చెప్పినప్పటికీ, దేశంలో ఆర్థిక అసమానతలు మాత్రం తగ్గే సూచనలు కనిపించడం లేదని ఆర్థిక నిపుణులు, మేధావులు తేల్చిచెప్తున్నారు. స్టాక్‌మార్కెట్ల సూచీలు, జీడీపీ వృద్ధిరేటును చూసి పేదలు, మధ్యతరగతి వర్గాలకు లాభం చేకూరుతుందని అనుకొంటే అది పొరపాటేనని చెబుతున్నారు. రానున్న ఐదేండ్ల మోదీ ప్రభుత్వ హయాంలో పేదలకు కొత్తగా ఒరగబోయేది ఏమీ ఉండబోదని స్పష్టం చేస్తున్నారు. 140 కోట్ల జనాభా ఉన్న దేశంలో.. ఇప్పటికీ 80 కోట్ల మందికి ఉచిత బియ్యం సరఫరా చేస్తున్న విషయాన్ని గుర్తు చేస్తున్నారు. ఈ మేరకు అంతర్జాతీయ పత్రిక 'రాయిటర్స్' సంస్థ మే 15-జూన్ 18 మధ్య నిర్వహించిన పోల్‌లో వెల్లడైంది. పోల్‌లో పాల్గొన్న మొత్తం 51 మంది ఆర్థికవేత్తల్లో .. ఏకంగా 43 మంది రానున్న ఐదేండ్లలో మోదీ హయాంలో దేశంలో ఆర్థిక అసమానతలు తగ్గే అవకాశమే లేదని, పేదల కష్టాలు తీరబోవని తేల్చిచెప్పడం గమనార్హం.



మెజారిటీ తగ్గడానికి కారణం ఇదే

ఇటీవల జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీకి మెజారిటీ సీట్లు రాకపోవడానికి కారణాలను కూడా ఆర్థికవేత్తలు విశ్లేషించారు. దేశంలో నెలకొన్న ఆర్థిక అసమానతలు, పెచ్చరిల్లిన నిరుద్యోగమే దీనికి కారణంగా వివరించారు. 2047లోగా భారత్‌ను అభివృద్ధి చెందిన దేశంగా మారుస్తానని ప్రధాని అంటున్నారని, అయితే, నైపుణ్యం కలిగిన మానవ వనరులను పెంచడం, నిరుద్యోగాన్ని రూపుమాపడం, సమ్మిళిత వృద్ధితోనే ఇది సాధ్యమౌతుందని ఆర్థిక నిపుణులు సూచించారు. దేశ ఆర్థిక ప్రగతికి నిరుద్యోగమే పెద్ద సమస్యగా మారిందని పోల్‌లో పాల్గొన్న 90 శాతం మంది అభిప్రాయపడ్డారు.

ధనికులు మరింత సంపన్నులుగా..

ప్రస్తుత ప్రభుత్వం తీసుకొస్తున్న విధానపరమైన నిర్ణయాలతో మధ్యతరగతి వర్గాల నడ్డివిరుగుతున్నది. ఉచితాల కోసం పేదలు ప్రభుత్వంపై పూర్తిగా ఆధారపడే దుస్థితి దాపురించింది. అయితే, ప్రభుత్వ ప్రోత్సాహకాలు, చేయూతతో ధనికులు మరింత సంపన్నులుగా మారుతున్నారు.

- సాయిబాలకర్, ప్రొఫెసర్, సెంటర్ ఫర్ స్టడీస్ ఇన్ సోషల్ సైన్సెస్

పసిడి-వెండి జిగేల్

- **ఒక్కరోజే రూ.810 పెరిగిన తులం బంగారం**
- **1,500 ఎగిసిన కిలో వెండి రేటు**

న్యూఢిల్లీ, జూన్ 21: బంగారం, వెండి ధరలు మళ్లీ పుంజుకుంటున్నాయి. శుక్రవారం హైదరాబాద్‌లో తులం 24 క్యారెట్ పుత్తడి రేటు రూ.810 పుంజుకొని రూ.73,250ని చేరింది. 22 క్యారెట్ ధర రూ.750 అందుకుని రూ.67,150గా నమోదైంది. వరుసగా 4 రోజులు స్థిరంగా లేదా పడిపోతూ వచ్చిన పసిడి విలువ.. గురువారం కూడా పెరిగిన విషయం తెలిసిందే. ఇక వెండి ధర మరో రూ.1,500 ఎగబాకింది. కిలో 94,000 పలుకుతున్నది. క్రితం రోజు కూడా రూ.1,500 ఎగిసిన సంగతి విదితమే. ఢిల్లీలోనూ 24 క్యారెట్ బంగారం రూ.73,350గా, కిలో వెండి రూ.93,700గా ఉన్నది. ఈ ఒక్కరోజే రూ.800, రూ.1,400 చొప్పున ఎగిశాయి. అంతర్జాతీయ మార్కెట్ విషయానికొస్తే.. కొమెక్స్‌లో స్పాట్ గోల్డ్ ఔన్సు ధర ఒకేసారి 28 డాలర్లు పెరిగి 2,360 డాలర్లు పలికింది. ఔన్సు వెండి 30.40 డాలర్లుగా ఉన్నది.

జీఎస్టీ స్లాబులు తగ్గాలి: జీటీఆర్ఐ

న్యూఢిల్లీ, జూన్ 21: వస్తు, సేవల పన్ను (జీఎస్టీ) స్లాబుల సంఖ్యను తగ్గించాలని గ్లోబల్ ట్రేడ్ రిసెర్చ్ ఇనీషియేటివ్ (జీటీఆర్ఐ) కేంద్ర ప్రభుత్వానికి, జీఎస్టీ మండలికి శుక్రవారం సూచించింది. శనివారం కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ అధ్యక్షతన జీఎస్టీ కౌన్సిల్ 53వ సమావేశం జరుగనున్నది. ఈ క్రమంలోనే జీఎస్టీ మినహాయింపు పరిమితిని రూ.1.5 కోట్ల వార్షిక టర్నోవర్‌దాకా ఉన్న అన్ని సంస్థలకు పెంచాలని కూడా జీటీఆర్ఐ కోరింది. ప్రస్తుతం ఇది రూ.40 లక్షలుగానే ఉన్నది. పరిమితిని పెంచితే సూక్ష్మ, చిన్న, మధ్యతరహా సంస్థ (ఎంఎస్ఎంఈ)లకు లబ్ధి చేకూరుతుందని, ఉద్యోగ-ఉపాధి అవకాశాలు పెరుగుతాయని జీటీఆర్ఐ ఈ సందర్భంగా చెప్పుకొచ్చింది. ఇక రాష్ట్రాలవారీ రిజిస్ట్రేషన్లను దూరం పెట్టాలన్నది. కాగా, శనివారం భేటీలో ఆన్‌లైన్ గేమింగ్‌పై పన్ను వేయడంతోపాటు, ఎరువులపై పన్నును తగ్గించాలన్న పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ సిఫార్సులపై చర్చ జరిగే వీలున్నది. ప్రస్తుతం ఎరువులపై 5 శాతం జీఎస్టీ పడుతున్నది. సల్ఫ్యూరిక్ యాసిడ్, అమ్మోనియా తదితర ముడి సరకులపై 18 శాతం వర్తిస్తున్నది. జీఎస్టీలో ఇప్పుడు 5, 12, 18, 28 శాతం స్లాబులున్న విషయం తెలిసిందే. మరోవైపు జీఎస్టీ రేటుపై హేతుబద్ధ కమిటీ ఏర్పాటైంది. బీహార్ ఉప ముఖ్యమంత్రి సామ్రాట్ చౌధరి కన్వీనర్‌గా నియమితులయ్యారు.

బడ్జెట్‌లో రోబో ట్యాక్స్?

ప్రతిపాదనను పరిశీలిస్తున్న కేంద్రం

న్యూఢిల్లీ, జూన్ 21: రాబోయే బడ్జెట్‌లో కొత్తగా 'రోబో ట్యాక్స్'ను కేంద్ర ప్రభుత్వం తీసుకురానుందా? అంటే అవుననే సమాధానాలే వినిపిస్తున్నాయి. ఇప్పటికే ఈ మేరకు ప్రతిపాదన వచ్చినట్టు తెలుస్తుండగా, దీన్ని అమల్లోకి తెచ్చే అవకాశాలే ఎక్కువగా కనిపిస్తున్నాయి. ఈ ఆర్థిక సంవత్సరానికి (2024-25)గాను పూర్తిస్థాయి బడ్జెట్‌ను వచ్చే నెల కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ పార్లమెంట్‌లో ప్రవేశపెట్టబోతున్నారు. దీంతో వృద్ధిరేటు, ఉద్యోగ కల్పన, ఆర్థిక విధానాలు, పెట్టుబడులు, రుణ భారం, ఆహార ద్రవ్యోల్బణం వంటి ప్రధానాంశాలపై ఆయా రంగాల పెద్దలతో, ఆర్థిక నిపుణులతో మంత్రి సమావేశాలు నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలోనే 'రోబో ట్యాక్స్' పరిశీలన తెరపైకి వచ్చింది.

ఏమిటిది?

కృత్రిమ మేధస్సు (ఏఐ) ప్రభావంతో ఇటీవలికాలంలో ఉద్యోగాలు పెద్ద ఎత్తున పోతున్నాయి. బడా కార్పొరేట్ సంస్థలన్నీ మానవ శక్తికి బదులుగా రోబో ఆధారిత శక్తిపై దృష్టి సారిస్తున్న ఫలితమే ఇదంతా. దీంతో ఏఐ కారణంగా కొలువుల్ని కోల్పోయినవారిలో నైపుణ్యం పెంచేందుకు, అందుకయ్యే ఖర్చులకు నిధుల సమీకరణ కోసం ఓ ఆర్థికవేత్త నుంచి వచ్చినదే ఈ 'రోబో ట్యాక్స్' ప్రతిపాదన. అంతర్జాతీయ ద్రవ్య నిధి (ఐఎంఎఫ్) పేపర్‌కు అనుగుణంగానే దీన్ని ఆర్థికవేత్తలు సూచిస్తున్నారు. ఏఐ రాకతో లాభాలున్నా.. భారీగా ఉద్యోగాలు పోతాయని, చాలామందికి ఇది బాధాకరమని ఐఎంఎఫ్ ఆందోళన వ్యక్తం చేస్తున్నది. అందుకే నైపుణ్యాభివృద్ధి, నిరుద్యోగ బీమా కవరేజీ, వేతన బీమాలతోపాటు ప్రస్తుత కార్పొరేట్ ట్యాక్స్ వ్యవస్థల్ని పునఃసమీక్షించాలని ఐఎంఎఫ్ ప్రపంచ దేశాలకు సలహా కూడా ఇచ్చింది. ఇక అభివృద్ధి చెందుతున్న దేశాలకు ఏఐతో పెద్ద ముప్పే పొంచి ఉన్నదని ఐఎంఎఫ్ తొలి డిప్యూటీ ఎండీ గీతా గోపీనాథ్ కూడా హెచ్చరించినది తెలిసిందే.

వ్యవసాయానికి పెద్దపీట వేయాలి

ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌తో శుక్రవారం జరిపిన ముందస్తు బడ్జెట్ చర్చల్లో వ్యవసాయ రంగ సంఘాలు, నిపుణులు.. వ్యవసాయ సంబంధిత పరిశోధనలకు ప్రాధాన్యతనివ్వాలని కోరాయి. అలాగే ఎరువుల సబ్సిడీని హేతుబద్ధం చేయాలని, వాతావరణ మార్పులతో తలెత్తుతున్న సవాళ్లను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు, వ్యవసాయ రంగ స్థితిస్థాపకతకు తోడ్పడేలా కావాల్సిన అన్ని మౌలిక వసతులను కల్పించాలని సూచించాయి. భారతీయ వ్యవసాయ పరిశోధన మండలి కోసం ఈసారి బడ్జె